# ట్రేడ్‌మార్క్

గరిశకుర్తి రాజేంద్ర

నిత్యరచయిత నిత్యానందం అసాహిత్య వార పత్రికకు పోటీకి కథరాయడానికి కాగితాలు ముందేసుకుని ఆలోచిస్తూ కూర్చున్నాడు. బుర్ర బద్దలు కొట్టుకున్నా 'స్పాట్'గా 'ప్లాటు' స్ఫురించడం లేదు. చేతులు నలుపుకున్నాడు. చెంపలు నొక్కుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. అయినా ఫలితం లేకపోవడంతో సుదీర్ఘంగా ఆలోచించడం ప్రారంభించాడు. సెల్లు మోగడంతో దాన్నందుకుని 'హలో' అంటూ పలకరించాడు. అసాధ్య మాసపత్రిక నుండి ఫోన్...

"నమస్కారం సార్! ఈ మాసం పత్రిక తిరగేసారా?" అని అవతల నుండి ప్రశ్న...

"అబ్బే! లేదండీ!" అన్నాడు నిత్యానందం అసహనంగా తన ఆలోచనలకు బ్రేక్ పడినందుకు విసుక్కుంటూ...

మీ కథ "మక్కికి మక్కీ" ఈ సంచికలో వచ్చింది చూసారా?" అవతల నుండి మరో ప్రశ్న.

"లేదండీ!" అన్నాడు మళ్లీ అసహనంగా నిత్య రచయిత నిత్యానందం.

"కథ చాలా బాగుంది. పాఠకుల నుంచి అప్పుడే 'స్పందన' తెలుపుతూ ఫోన్‌లు రావడం ప్రారంభమైంది. కాంప్లిమెంటరీ కాపీ పంపించాము. పారితోషికం త్వరలోనే అందుతుంది. ఇంకా బాగా రాయండి... అభినందనలు" ఫోన్ కట్టయ్యింది.

ఆశ్చర్యపోయి, ఉబ్బితబ్బిబ్బవడం నిత్యానందం వంతయింది. ఇటీవల సదరు పత్రికకు కథను పంపినట్లే గుర్తులేదు. జుట్టుపీక్కున్నా, బుర్ర గోకున్నా ఫలితం లేకపోవడంతో అప్పటికి పోటీకి వ్రాసే కథ విషయం పక్కకునెట్టి, తన కథల ఫైలు, డైరీ తీసుకున్నాడు. ఆ పత్రికలో వచ్చిన కథను తాను పంపి, మరచిపోయానా అని ఆలోచిస్తూ. నిత్యానందం ఏ పత్రికకు రచన పంపినా దాని 'జిరాక్స్' కాపీ తప్పక ఉంచుకుంటాడు. పంపిన తేదీ వివరాలు, ప్రచురితమైందీ లేనిదీ డైరీలో నోట్ చేసుకుంటాడు. ఆ ధైర్యం తోటే డైరీ అంతా తిరగేశాడు. కథల 'జిరాక్స్' కాపీలన్నీ పరిశీలించాడు. ఎక్కడా తానా కథ పంపిన దాఖలాలు లేవు. 'రాజకోట రహస్యం' లాగా, 'గండికోట రహస్యం' లాగా ఈ 'మక్కికి మక్కీ' కథ అతణ్ణి వేధించసాగింది. ఈ దేశంలో ఎవడైనా ఇతరులను దోచుకోవాలనుకుంటాడు గానీ, ఇతరులకు దోచిపెట్టాలనుకోడు. రచన చేయాలని ఆసక్తి వుండీ, ఎన్ని రకాలుగా రాసినా పత్రికల్లో ప్రచురణ కాకపోవడంతో పాత సంచికలు తీసి, కాపీ చేసి పంపి చీవాట్లు తిన్నవాళ్లను, సాహిత్యానికే దూరమైనవాళ్లనూ ఎంతోమందిని చూసాడు తాను. ఆమాటకొస్తే పత్రికలకు రచనలు పంపీ, పంపీ ఒక్కటీ ప్రచురణ కాకపోవడంతో తానూ అదేపని చేద్దామనుకున్నాడు మొదట్లో... ఆ ప్రయత్నం మానుకుని పట్టుదలతో కృషి

చేసి, మరిన్ని రచనలు చేశాడు... అదృష్టం కలిసొచ్చింది. 'అహోభాగ్య' లగ్నం వరించింది. తాను రాసింది, రాసినట్లు పొల్లు పోకుండా పత్రికలు ప్రచురించే స్థాయికి ఎదిగాడు. కొన్ని పత్రికలు తన పేరు చూస్తేనే రచన చదవకుండానే ప్రచురించే 'పాపులారిటీ' సంపాదించుకున్నాడు. అదంతా సరే, ఈ కథ మాటేమిటి? 'సస్పెన్స్' ముడి విప్పలేక మూలుగుతూ పడుకున్నాడు.

* * *

పట్టువదలని విక్రమార్కుని లాంటి తిరుగుటపా రచయిత రవీంద్ర ఆ రోజు చాలా ఉత్సాహంగా వున్నాడు. అసాధ్య మాసపత్రిక ఈ నెల సంచికను ఉదయమే వెళ్లి కొనుక్కుని వచ్చి వినాయకుడి ముందు ఉంచాడు. దానికి ఘనంగా పూజ చేసి టెంకాయ కొట్టి వినాయకుడికి మనసారా మొక్కుకున్నాడు. ఇన్నాళ్లకు ఈ రకంగానైనా తన కోరిక తీరినందుకు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. శ్రీహరికోట నుండి వదలిన 'వ్యోమనౌక' విజయవంతంగా 'స్పేస్'లోకి దూసుకెళ్లినప్పుడు అక్కడి సైంటిస్ట్‌లు పొందే ఆనందం కన్నా ఎక్కువ ఆనందపడ్డాడు. ఇకపై తానూ రచయితనేనని 'కాలర్' ఎగరేసి, ఇంట్లోనే అటూ ఇటూ పచార్లు చేసాడు. మాసపత్రికను మళ్లీ మళ్లీ తిరగేసి, నిత్య రచయిత నిత్యానందం పేరుతో ప్రచురితమైన తన కథను మళ్లీ






మళ్లీ చదువుకొని ఆనందపడ్డాడు రవీంద్ర.

"హిప్ హిప్ హుర్రే" నేనే గెలిచాను, నేనే గెలిచాను... అని గట్టిగా అరిచి, మరింత అరిస్తే పక్కవాళ్లు విని, దడుసుకోవచ్చని ఆ ప్రయత్నం మానుకొన్నాడు.

తన గురువుగారైన నిత్యానందంతో ఈ విషయం చెప్పాలని, అతనితో 'శభాష్' అనిపించుకోవాలని అతని ఇంటికి బయలుదేరాడు.

* * *

నమస్కారం సార్! నేను గుర్తున్నానా? పలకరించాడు తన రచనా గురువైన నిత్యానందని... మాసపత్రిక అతని చేతిలో ఉంచుతూ రవీంద్ర.

"రావోయ్ రవీంద్ర... ఈ మధ్య బొత్తిగా నల్లపూసైపోయావేం?" అని పలకరిస్తూ మాసపత్రికను తిరగేసి అందులో కాగితం మడచిన కథను చూసాడు. అది తన పేరున ప్రచురితమైన కథ. అతనికి వెంటనే విషయం గుర్తుకొచ్చింది. "అయితే ఇది నీ నిర్వాకమన్న మాట" అంటూ కోపగించినట్టే... ప్రశంసించాడు.

"అవును సార్! ఆ రోజు మనం 'ఛాలెంజ్' చేసుకున్నాం. నేనే విజయం సాధించాను. ఒప్పుకుంటారా?" ప్రశ్నించాడు రవీంద్ర...

"ఎదురుగా సాక్ష్యం కనబడుతూంటే ఒప్పుకోక ఛస్తానా?" నీవు వాదించినట్టే జరిగింది..." నిజంగానే మిగతా ఆఫీసుల్లో, పాఠశాలల్లో, అన్ని చోట్లా ఓపిక తగ్గినట్లే, పత్రికా రంగంలోనూ తగ్గింది. కొత్త రచయితల రచనలు చదివి, సరిదిద్ది, ప్రచురించి, ప్రోత్సహించే ఓపిక, తీరిక లేకపోబట్టే నాలాంటివాళ్లు పెద్దరచయితలుగా చెలామణి అవుతూంటే, నీలాంటి వాళ్లు తిరుగుటపా రచయితలుగా మిగిలిపోతున్నారు. నీ పరిశీలన, పరిశోధన మెచ్చదగింది సుమా!" మెచ్చుకోలుగా రవీంద్ర భుజంతట్టి మరీ అన్నాడు నిత్యానందం.

"మీరైనా పూనుకొని మాలాంటి కొత్త రచయితలను ప్రోత్సహించే ప్రయత్నం చేయాలి" వినయంగా అన్నాడు రవీంద్ర.

"అలాగే... నీ రచనలన్నీ చదివి మార్పు చేర్పులు చేసి మంచి రచయితగా తీర్చిదిద్దుతాను" 'హామీ' ఇచ్చాడు నిత్యానందం. ●